క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



గుడివాడ టౌన్: స్థానిక కొత్తపేట శ్రీ విజయ దుర్గ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి సారె అందజేశారు. కొత్తపేటకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారి కరుణా కటాక్షాలు పొందడానికి ఏటా కార్యక్రమం నిర్వహిస్తామని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు దంపతులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఆరోగ్యం



కైకలూరు: పచ్చటి ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్ కుమార్ చెప్పారు. కలిదిండి మండలం కోరుకొల్లులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల సిబ్బందికి ఒక రోజు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి తోటల పెంపకంలో కూరగాయలు, ఆకుకూరలను ప్రస్తుత తరుణంలో సాగు చేసుకోవాలని సూచించారు. సేకరించిన తీగజాతుల విత్తనాలను మహిళలతో ప్యాకింగ్ చేయించారు. కార్యక్రమంలో కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల ఇన్‌చార్జిలు శోభారాణి, వెంకటలక్ష్మి, నారాయణ, రిసోర్సు పర్సన్లు నజీర్ ఖాన్, గంగాభవాని, రామాంజనేయులు, అహోబలరావు, జ్యోతి, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతికి నిధులు



కైకలూరు: గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు కేటాయించిన నిధులతో శుక్రవారం వదర్లపాడులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, దొడ్డిపట్ల గ్రామంలో రూ.6 లక్షలతో డ్రైయిన్ నిర్మాణ పనులను ఎంపీపీ ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పని చేస్తున్నారని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, నాయకులు ఘంటసాల సురేష్, జయరాజు, పంచాయతీరాజ్ ఏఈ సాధిక్ పాషా పాల్గొన్నారు.

ముదినేపల్లి అభివృద్ధికి కృషి



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల రోడ్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.5 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఐటీఐ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణను అభినందించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం



మండవల్లి: మండవల్లి వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ సహాయ సంచాలకులు జి వెంకటమణి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఖరీఫ్-2023 ప్రారంభం కావడంతో ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు.

అర్హులైన రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లను అందించాలని వీఏఏలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ షేక్ జరీనా, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జంగం వరలక్ష్మి, సభ్యులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

కైకలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి నెల రోజుల పాటు కొనసాగిస్తున్న జగనన్న సురక్షతో సత్వర సేవలు అందుతాయని ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కైకలూరు మండలం రాచపట్నం, కలిదిండి మండలం పడమటిపాలెం సచివాలయాల్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డీఎన్నార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పూర్వం వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల కేంద్రాలకు కాళ్లు అరిగేలా తిరిగేవారన్నారు. నేడు సీఎం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయన్నారు. కుల, ఆదాయ, రిజిస్ట్రేషన్లు ఇలా 11 రకాల ధ్రువపత్రాలను అధికారులు అందిస్తున్నారని చెప్పారు. అర్జీలు పెట్టుకున్న పలువురికి ధ్రువపత్రాలు అందించిన తర్వాత సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, పార్టీ మండలాధ్యక్షులు భట్రాజు శివాజీ, తిరుమాని రమేష్, సర్పంచ్‌లు అల్లూరి మంగారావు, సానా మీనా సరస్వతీ, ఉలిసి వసంతకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యులు ఈదా కృష్ణవేణి, టిక్కం శ్యామ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, విద్యుత్ దీపాల ప్రారంభం

పడమటిపాలెంలో రూ.13.40 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, రూ.7.70 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు, వీధి దీపాలను ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక 26వ వార్డుకు సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న కైకాల సత్యనారాయణ కళామందిరంలో జరిగింది. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో కొత్తగా ఎంపిక చేసిన 71 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, 661 మందికి వివిధ రకాలకు చెందిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక 9వ వార్డులో జరిగిన జగనన్న సురక్షలో మొత్తం 441 మందికి అవసరమైన వివిధ రకాల ధ్రువీకరణ



సానారుద్రవరంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పత్రాలను అందజేసి తొమ్మిది మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.రాంబాబు, ఆర్ఐ నాగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దుడ్డు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రయోజనం

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరులో శుక్రవారం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్లు మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రజలకు ప్రయోజనమని తెలిపారు. 169 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీటీసీ డొక్కు భూలక్ష్మి, సర్పంచ్ పెనుమూడి రమేష్, ఈవోపీఆర్‌డీ వీర్ల సీతారామయ్య, డీటీ గోపాలరావు, ఎంఎస్ఎన్ మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. సమావేశంలో 500కు పైగా సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీల సభ్యులు జంపాన కోటయ్య, మరీదు నాగయ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెనుమాలంకలో శుక్రవారం జగనన్న సురక్ష జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని



ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్



ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న నాయకులు

కోరారు. పింఛను సమస్య లేవనెత్తిన వృద్ధుడికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. దరఖాస్తుదారులకు పత్రాలను అందజేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బిజయేసోబురాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సర్పంచ్ ముంగర నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మోరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: జగనన్న సురక్ష సభను శుక్రవారం పెంజెంద్ర గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించారు. 240 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీల కన్వీనర్ బలుసు జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు గ్రామ సచివాలయం-1లో సర్పంచ్ పెనుమత్స రాధిక ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మఒడి, జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజమణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

మొవ్వ: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు సాధించారు. మొవ్వ మండలం కాజ జెడ్పీ పాఠశాలకు చెందిన షేక్ మస్తాన్ అలీ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో, భట్లపెనుమర్రు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సుంకర నాగ అక్షయ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించినట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బండి రమాదేవి (కాజ), సీహెచ్వీ సుబ్రహ్మణ్యేశ్వరరావు (భట్లపెనుమర్రు) విలేకరులకు తెలిపారు. వీరు పది ఫలితాల్లో మండల స్థాయిలో తొలి రెండు స్థానాలను సాధించారు.



మస్తాన్ అలీ



నాగ అక్షయ

ఉత్తమ రైతుకు సత్కారం

ముదినేపల్లి రూరల్: మండల స్థాయిలో ఉత్తమ రైతుగా ఎంపికై ప్రశంసాపత్రం, నగదు బహుమతి పొందిన మండలంలోని గురజకు చెందిన రైతు పుట్టి సుబ్బారావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యాన శాలువాలు, పూలమాలలతో వైఎస్సార్ సీపీ నేతలు సత్కరించి అభినందించారు. ఇటీవల వైఎస్ జయంతి సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రైతులకు విజయవాడలో సమావేశం నిర్వహించి సత్కరించారు. దీనిని పురస్కరించుకుని సుబ్బారావును స్థానిక నేతలు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గంటా సంధ్య, కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, మరీదు వసంతరావు, పేర్ని పృథ్వి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతు సుబ్బారావును సత్కరిస్తున్న నేతలు

పిల్లల్లో పరివర్తనకే 'లిల్లీ'

పెదమద్దాలి(పామర్రు): పిల్లల్లో విలువలు తెలియజేసి పరివర్తనే తీసుకురావడమే లిల్లీ చిత్ర ఉద్దేశమని ఆ చిత్ర కథా రచయిత, దర్శకులు మెరుగుమాల శివమ్ అన్నారు. ఆయన స్వగ్రామమైన పెదమద్దాలికి శుక్రవారం వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న నాలుగు భాషల్లో ఈ సినిమాను విడుదల చేశామన్నారు. రైతు బిడ్డ డొక్కు కోటయ్య, శ్రీసుబ్రమహేశ్వర అభినందన ట్రస్టు అధ్యక్షులు డొక్కు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పామర్రు కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు పీఎంఎస్ ప్రసాద్, ట్రస్టు సభ్యులు అశోక్, భవాని, వేణు, శ్రీనివాస్, రాజేష్, రాజేష్, సావిత్రమ్మ పాల్గొన్నారు.



సినీ దర్శకులు శివమ్‌ను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు

యువకుడికి నిప్పు అంటుకుని గాయాలు

గుడివాడరూరల్: ప్రమాదవశాత్తు యువకుడికి నిప్పు అంటుకుని గాయపడిన ఘటన పట్టణంలోని సాయిసూర్య అపార్టుమెంట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అలంకార్ రెస్టారెంట్ పక్కరోడ్డులో ఉన్న సాయి సూర్య అపార్టుమెంట్‌లో నివసిస్తున్న అడవి సాయికిరణ్‌కు ఇంట్లోనే ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీన్ని గమనించిన తల్లి గట్టిగా కేయలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలను అదుపు చేసి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంటలు ఎలా అంటుకున్నాయనే దానిపై యువకుడు పోలీసులకు స్పష్టత ఇవ్వలేదు. మంటలు అంటుకున్నాయని, మా అమ్మ గట్టిగా కేకలు వేసిందని యువకుడు పోలీసులకు తెలిపాడు. ఘటనపై నిజాలు స్పష్టంగా తెలియకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని వన్‌టౌన్ ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్ తెలిపారు.

దాడి కేసులో వ్యక్తికి జైలు

గుడివాడటౌన్: మహిళపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఒకరికి జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా విధించినట్లు పామర్రు సీఐ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదమద్దాలికి చెందిన పాము కోటేశ్వరమ్మపై స్థానికులు బేతపూడి ప్రకాశం, బేతపూడి సుకన్య, దాసరి అన్నపూర్ణ 2020 జనవరి 26న దాడిచేసి గాయపర్చారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహమ్‌తుల్లా షరీఫ్ 12మంది సాక్షులను విచారించారు. మహిళపై దాడి రుజువు కావడంతో బేతపూడి ప్రకాశరావుకు రెండేళ్ల జైలుశిక్ష, రూ. 5 వేలు జరిమానా, బేతపూడి సుకన్య, దాసరి అన్నపూర్ణకు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ తీర్పు ఇచ్చారు.

గుర్రపుడెక్క తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మురుగునీరు ప్రవహించే ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగరంలోని డ్రెయిన్ల ద్వారా మురుగునీరు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ప్రధాన డ్రెయిన్‌లో కలుస్తోంది. గుర్రపుడెక్క పేరుకుపోవడంతో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. దీని తొలగింపు పనులను నగర పాలక సంస్థ జేసీబీ సాయంతో చేపట్టారు.

నేడు గుడ్లవల్లేరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేయనుండటంతో విద్యుత్ సరఫరా ఆపుతారని పేర్కొన్నారు.

ఏజీపీగా నీలం బెంజిమెన్



గుడివాడ టౌన్: గుడివాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (ఎఫ్‌టీసీ) అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది నీలం బెంజిమెన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న జీఓ నెంబర్ 187 ద్వారా నియమించింది. మూడేళ్లపాటు పదవిలో ఆయన కొనసాగుతారని జీఓలో పేర్కొన్నారు. బెంజిమెన్ నియామకంపై పలువురు సీనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏఓ సునీల్ అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు ఆర్బీకేలో ఆయన స్థానిక రైతులకు సబ్సిడీపై ఎరువుల పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో రైతులకు ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. కౌలు కార్డులు తీసుకోవాలని ఆయన కోరారు.

గుడ్లవల్లేరు: ఎస్ఎల్ఎం ద్వారా గుడ్లవల్లేరులో పాడి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి శుక్రవారం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ ఎం.ఎస్.ఎ.దివాకర్, వెటర్నరీ ఉప సంచాలకులు జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఆఫ్ సైన్సెస్ కాలేజీలో శుక్రవారం విజయవాడ ఎపిసోర్స్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. వీటికి 50 మంది హాజరవ్వగా 20మంది ఎంపికైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు విలేకరులకు తెలిపారు. శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ అభినందించారు.

మత్తుపదార్థాలు, బాల్య వివాహాలపై అవగాహన

మండవల్లి: మత్తు పదార్థాలతో కుటుంబం విచ్ఛిన్నవుతుందని డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ కో-ఆర్డినేటర్ టి.లీలావతి, సామాజిక వేత్త ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన మండలంలోని భైరవపట్నంలో 30 సంవత్సరాల నుంచి గుడారాలు వేసుకుని జీవిస్తున్న పిట్టలోళ్లు అని పిలిచే గుడారాల వద్ద శుక్రవారం మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు అంశంపై అవగాహన కల్పించారు. ఎల్ఎస్ భాస్కరరావు, రాజా, సింధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ముదినేపల్లి రూరల్: విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని సబ్జెక్టులపై విద్యార్థులు భయం పెంచుకోవడం సహజమన్నారు. వారికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

పామర్రు: రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా శుక్రవారం పామర్రులో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం -1 భవనాన్ని ప్రారంభించారు. సచివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంత్రికి స్వాగతం పలికి ఆమెకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి తొలిసారిగా మంత్రి.. పామర్రుకు రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానిక ఓ కల్యాణ మండపంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మార్గంమధ్యలో వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీలు కె.స్వరూపరాణి, రాజులపాటి పార్వతి, జొన్నల రామ్మోహనరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ కె కస్తూరి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే అనిల్‌కుమార్



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన మంత్రి రోజా, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తదితరులు

పలుచోట్ల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్‌రోడ్డులో శ్రీ విజయదుర్గ దేవస్థానంలో అమ్మవారిని శాకంబరేశ్వరీదేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల పండ్లతో, కూరగాయలతో అలంకరించారు. వేదపండితులు పునీత్ శర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీ నారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి రోడ్డులో..

స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు, పాలక మండలి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భీమేశ్వరాలయంలో..

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరి ఆలయంలోని అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించి విశేషంగాపూజలు చేశారు. సుమారు 25 కేజీల పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలో బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సుశీల దంపతుల సౌజన్యంతో విశేష అర్చనలు జరిగాయి

గుడివాడ, ముదినేపల్లి, గుడ్లవల్లేరు ఎంఈఓ-1లు బాధ్యతల స్వీకరణ

గుడివాడరూరల్: గుడివాడ మండల ఎంఈవో-1గా ఇందుపల్లి విజయ్ శుక్రవారం విధుల్లో చేరారు. గుడ్లవల్లేరు మండలంలోని ఎస్‌వీవీజీఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడి చేస్తున్న ఆయన పదోన్నతిపై మండల ఎంఈవో-1గా నియమితులయ్యారు. విధుల్లో చేరిన ఎంఈవోకు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి ఎంఈఓగా-1గా శేవ్య

ముదినేపల్లి రూరల్: మండలానికి ఇటీవల జరిగిన కౌన్సెలింగ్ తర్వాత ఎంఈఓ-2గా కె.నరేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ-1గా ఎం.శేవ్యను నియమిస్తూ డీఈవో ఆదేశాలు జారీ చేశారు. శేవ్య నూజివీడు మండలం ఎంఈఓ-1గా విధులు నిర్వహిస్తుండగా పూర్తి అదనపు బాధ్యతలతో ముదినేపల్లి మండలానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు - 1 నూతన ఇన్‌చార్జి ఎంఈఓగా జి.జగన్‌మోహనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంగలూరు హైస్కూల్లో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారని గుడ్లవల్లేరు ఎంఈఓ-2 జి.గోపాలరావు తెలిపారు. జగన్‌మోహనరావును గోపాలరావుతో పాటు సీఆర్పీలు, సిబ్బంది అభినందించారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు

పామర్రు: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాలు ముగిశాయని జిల్లా పశువైద్యాధికారి దివాకర్ తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలు పడే సమయం, రుతుపవనాలు వచ్చే వేళలో పశుగ్రాసం పెంచుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. వీటిపై పశుపోషకులకు అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.



విత్తనాలు అందిస్తున్న పశువైద్యాధికారి దివాకర్

సీనియర్ న్యాయవాది దేవకీనందన్ మృతి

గుడివాడ టౌన్: గుడివాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది వైకుంఠపు దేవకీనందన్ (55) శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పదిహేను రోజుల క్రితం కుక్క కాటుకు గురైన దేవకీనందన్ వైద్యం చేయించుకుంటున్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం స్వగ్రామమైన పామర్రులో నిర్వహిస్తారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతిపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు కె.హరినాథ్, ఎస్వీ పాండురంగారావు, ఎస్.ప్రభాకరరావు, కె. రవి, బంగారయ్య, కె.మురళి, నీలం బెంజిమన్, ఎంఎస్‌పీ రెడ్డి, రహమ్‌తుల్లా, గంటా రమేష్ మనోహర్, సీహెచ్ కుటుంబరావు, బట్టు సత్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



శ్యామలాంబకు లక్ష కనకాంబరాలతో పూజ

కైకలూరు: ఆషాఢ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా కైకలూరు శ్యామలాంబకు లక్ష కనకాంబరాల పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భీమా కిషోర్, సీతారామయ్య బృందాలు పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, శ్యామలాంబ, రామలింగేశ్వర, వేంకటేశ్వర దేవాలయాల చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు, బొప్పన శివకుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు శ్యామలాంబ దేవాలయం వద్ద పూజకు సిద్ధం చేసిన కనకాంబరాలు

పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు సహకరించండి

గుడివాడ టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ పద్మావతి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024లో నియోజక వర్గానికి సంబంధించి కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు, ఓటర్ల వెరిఫికేషన్, ఇతర కార్యక్రమాలకు రాజకీయ నాయకుల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ ఆంజనేయులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.